క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.1.05 లక్షల విరాళం

పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.1.05 లక్షలను విరాళంగా అందజేశారని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక ఆలయంలో దాతలు తమ విరాళాలను అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కందుల భీమేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మి, కుమారులు వెంకటేశ్వరరెడ్డి, రవితేజా రెడ్డి కలిసి ఆలయ అభివృద్ధికి రూ.1,00,005 ఇచ్చారని తెలిపారు. అదే విధంగా స్థానికులు తమ్మా మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు విశ్వనాథ్‌రెడ్డి రూ.5,016ను విరాళంగా అందించారన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు లంకా భీష్మకుమారి, ఆలయ సిబ్బంది కూసం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



పామర్రు: పేదలకు ఆరోగ్య ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో బాధిత కుటుంబాల వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 23 మంది లబ్ధిదారులకు రూ.19,65,589ను సీఎం ఆర్‌ఎఫ్‌గా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు జన్ను శోభన్‌బాబు, జన్ను నాగ మురళి, పరసా సుబ్రమణ్యేశ్వరరావు, వీరంకి వెంకటేశ్వరరావు, అంజనేయులు పాల్గొన్నారు.

వంతెన పనులకు రూ.94 లక్షల మంజూరు

తోట్లవల్లూరు: పెనమకూరులోని ఏనుగులకోడు డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 94 లక్షలు మంజూరు చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శిథిలావస్థలో ఉన్న వంతెన పునర్నిర్మాణం విషయమై 2023 జూలై 10న అప్పటి రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో ఏనుగులకోడు వంతెనకు అప్రోచ్ శ్లాబు, సైడ్‌వాల్స్, అప్రోచ్ రోడ్ల నిర్మాణం నిమిత్తం రూ. 94 లక్షలు మంజూరు చేస్తూ జీఓ నంబరు 350 జారీ చేస్తూ ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

శరవేగంగా ఆలయ పునర్నిర్మాణ పనులు



గుడ్లవల్లేరు: మండలంలోని ఉలవలపూడిలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను శర వేగంగా నిర్వహిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన స్వామివారి ఆలయ స్థానంలో గ్రామస్తుల సంయుక్త సహకారంతో ఈ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని ఆ గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు తెలిపారు.

కొండలమ్మకు ప్రసాదం కవర్ల వితరణ



గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి లడ్డూ, పులిహోర ప్రసాదం ప్యాకింగ్‌కు చెందిన 20 వేల సైజుల వారీగా ప్యాకింగ్ కవర్లు మచిలీపట్నం సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు అందించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ కవర్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ షాపింగ్ మాల్స్ ఎండీ మావూరి వెంకట రమణ పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకస్వామి ఆర్ తేజోరామ్, ఆగమ ప్రవర పరాశరం శ్రీరంగనాథాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బుడమేరు ప్రక్షాళన గాలికేనా?

- నిధులు కేటాయించని కూటమి ప్రభుత్వం
- మాటలకే పరిమితమైన ప్రక్షాళన



వరదల సమయంలో పుట్టగుంట వద్ద నీటమునిగిన పంట పొలాలు (ఫైల్)

గుడివాడరూరల్: బుడమేరు ప్రక్షాళనను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. వరదల సమయంలో విపత్తు వలన విజయవాడ మహానగరంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలు కకావికలమయ్యాయి. ప్రాణ, పంట నష్టంతో ప్రజలు, రైతులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. వరదల సమయంలో బుడమేరు ప్రక్షాళన చేస్తామంటూ కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలాయి. బుడమేరు ఆక్రమణలు తొలగిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బుడమేరు ప్రక్షాళనకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో ప్రక్షాళన జరిగేనా అని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ డ్రెయిన్ అయిన బుడమేరు ఆక్రమణలతో నిండిపోవడంతో గతంలో వచ్చిన తుపాను, వరదల దెబ్బకు విజయవాడ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు రోజుల తరబడి ముంపులోనే ఉన్నారు. చరిత్రలో లేని విధంగా నగరం రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకుంది. విజయవాడ నుంచి కొల్లేరు వరకు పరిసర ప్రాంతాల్లోని గ్రామాలు ముంపునకు గురికావడంతో పాటు పంట పొలాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఫలితంగా ప్రాణ, పంట నష్టం జరిగింది. వరదల సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి బుడమేరు ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చారు. కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు ఆక్రమణలు తొలగిస్తామని ఉపన్యాసాలతో ఊదరగొట్టారు. తీరా బడ్జెట్ కేటాయింపుల్లో బుడమేరు ప్రక్షాళనకు నయా పైసా కేటాయించలేదు. ఇప్పటి వరకు ప్రక్షాళన చేస్తారని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. మళ్లీ వరదలు వస్తే మా పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళనలో ఉన్నారు.

ఆక్రమణలు యథాతథం

బుడమేరు డ్రెయిన్‌లో విజయవాడ నుంచి కొల్లేరు వరకు ఉన్న ఆక్రమణలు యథాతథంగానే ఉన్నాయి. వరదల సమయంలో డ్రెయిన్‌లో ఉన్న రొయ్యల, చేపల చెరువులు, అక్రమ కట్టడాలు, అక్రమ సాగుల వలన నీటి ప్రవాహానికి అవరోధంగా మారి నీరు సవ్యంగా సాగక పరిసర ప్రాంతాలను వరద ముంచెత్తింది. ఫలితంగా గ్రామాలు రోజుల తరబడి నీళ్లలో నానాయి. పంట పొలాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. వరదల సమయంలో ఆక్రమణలు తొలగిస్తామని, ప్రక్షాళన చేస్తామని చెప్పిన నాయకులు పత్తా లేకుండా పోయారు. కనీసం ఆక్రమణ తొలగింపునకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఆక్రమణలు తొలగే అవకాశం లేదని ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి బుడమేరు ప్రక్షాళనకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం



బుడమేరు ముంపు సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరిస్తోంది. ఆక్రమణలు తొలగిస్తామని చెప్పిన మాట పెడచెవిన పెడుతోంది. ఆక్రమణల తొలగింపునకు భారీగా నిధులు కావాల్సి ఉంది. డ్రెయిన్ ప్రక్షాళనకు రివర్స్ కన్‌ఫర్మేస్సీ యాక్ట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తేనే ప్రక్షాళన సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– నీలం మురళీకృష్ణారెడ్డి, రైతు సంఘ నాయకుడు

ఆక్రమణలతో నష్టపోయాం



ఆక్రమణల దెబ్బకు వరదల వలన పంటలు పూర్తిగా పోయి తీవ్రంగా నష్టపోయాం. పంటలు ముంపునకు గురై పెట్టిన పెట్టుబడిన నీటిపాలైంది. ఆక్రమణల వలన నీరు సక్రమంగా ప్రవహించక రైతులను నట్టేట ముంచింది. ఆక్రమణలు తొలగిస్తామని ప్రభుత్వం చెప్పి నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ముంపు సమస్యకు నిధులు కేటాయించి, ఆక్రమణలు తొలగించాలి.

–సత్యనారాయణ, రైతు ఎల్‌ఎన్‌పురం

'యువత పోరు'ను విజయవంతం చేయండి



యువత పోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్ తదితరులు



మామిడికోళ్లలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సుజాత తదితరులు

పామర్రు: కృష్ణా జిల్లా స్థాయిలో ఈ నెల 12న నిర్వహించే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో ఆయన ఆదేశాల మేరకు సోమవారం 'యువత పోరు' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసిన ఈ కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు అండగా నిలుస్తూ మన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 12న మచిలీపట్నంలో నిర్వహించబోయే వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల వెంకటశ్వరరావు, పార్టీ నేతలు కొచ్చెర్ల శ్రీనివాసరావు, ఎన్ సురేష్‌రెడ్డి, వీరంకి అర్జునరావు పాల్గొన్నారు.

యువత పోరుకు సిద్ధం

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం యువత పోరుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పడమటి సుజాత అన్నారు. సోమవారం మామిడికోళ్లలో ఆమె యువత పోరు కార్యక్రమానికి చెందిన బ్రోచర్లను ఆవిష్కరించారు. చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు, నాయకులు వెంకటేశ్వర నాయక్, మట్టా కమల, కుంపటి మాధవి, రాయవరపు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్‌ను బాగుచేయండి



సమస్యలను తెలియజేస్తున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ పుల్లలపాడులోని బీసీ సంక్షేమ హాస్టల్ శిథిలావస్థకు చేరి పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ఎంతోమందికి విద్యనందించి ఆశ్రమం కల్పించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందన్నారు. ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలతో పాటు భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి పాములకు నిలయంగా మారిందన్నారు. వెంటనే పురపాలక సంఘం, బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్పందించి పరిసర ప్రాంతాలను శుభ్రపర్చి స్థానికుల సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏఎన్నార్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: విజయవాడలో జరిగిన ఉని ఫెస్ట్–2025లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. సోమవారం కళాశాల కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు బి. పల్లవి, నేతాజి, ఎం. సాయిభరత్ క్విజ్ విజ్ పోటీల్లో, డి. బిందులక్ష్మి, అబ్దుల్ నగీనా, లీలా నాగకుమార్ బ్రాండ్ రేస్ పోటీల్లో విజయం సాధించారని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కేవీఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ హెచ్‌ఓడీ డాక్టర్ ఎంబి. సువర్చల పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం వాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు



మొవ్వలో క్రీడాకారులను అభినందించిన పాఠశాల విద్యాకుటుంబం

గుడివాడ టౌన్/నందివాడ: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు తమ విద్యార్థినులు ఎంపికైనట్లు వెన్ననపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పీఎంఎస్ వాణి తెలిపారు. సోమవారం పోటీలకు ఎంపికైనవారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 7న మొవ్వ జెడ్పీ హైస్కూల్లో జరిగిన సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు బొమ్మిడి నాగచైతన్య, మేడేపల్లి నిహారిక తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో వెఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వలో ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్‌లో ఎంపికైన మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఆ పాఠశాల విద్యాకుటుంబం సోమవారం తమ అభినందించింది. బాలికల విభాగంలో నందేటి సంకీర్త్య, బాలుర విభాగంలో ప్రదీప్‌కుమార్, శామ్యూల్, బాల హర్షవర్ధన్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం శివ కోటేశ్వరరావు అభినందించారు. వీరు ఈ నెల 14,15,16 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో నిర్వహించే పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు.

ఘనంగా భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: స్థానిక బైపాస్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ పరివార సమేత శ్రీ ఉమా నాగమల్లేశ్వర స్వామి వారి దేవస్థానం వార్షికోత్సవ భూమిపూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి 16వ వార్షికోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా ఏర్పాట్లలో భాగంగా భూమి పూజ చేసి రాతా ఏర్పాటు చేసినట్లు గంటా రాజుస్వామి తెలిపారు. శనివారం ఉదయం నుంచి దేవస్థానంలో విశేష హోమపూజా కార్యక్రమాలు, స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని వార్షికోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



ముదినేపల్లిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులు

ముదినేపల్లి రూరల్: తొలి మహిళా ఉపాధ్యాయిని, సమాజ సేవకురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం ముదినేపల్లిలో జరిగింది. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. పూలే విగ్రహ కమిటీ అధ్యక్షుడు పళ్లెం పుణ్యేశ్వరరావు, గౌరవ కార్యదర్శి నిమ్మగడ్డ భిక్షాలు, వాసు, వీరవెంకటేశ్వరరావు, వరప్రసాద్, గిరిరాజు, నరసింహరావు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్‌లోని జ్యోతీరావ్ పూలే–సావిత్రిబాయి పూలే విగ్రహాలకు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ జిల్లా గవర్నర్(ఎలక్ట్) ఎల్ఈ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కె. రామారావు, కోశాధికారి టి. రామ్మోహన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

- మల్లంపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జగన్నాధపురంలోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని పండ్లు, మిఠాయిలు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం జి. శ్రీలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్త్రీ జాతికి విద్యావిధానానికి కృషి చేసిన విప్లవకారిణి, సంఘ సంస్కర్త సావిత్రి బాయిపూలే అని బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, కె శాంతరాజు, గోరింక గాంధీ అన్నారు. బాబా సాహెబ్ విగ్రహం వద్ద సోమవారం సావిత్రి బాయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాలి నాగయ్య, జి మరియన్న, సి శాంతారావు, బి రమేష్, రాంబాబు, సంజీవరాజు, జి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ముదినేపల్లి రూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో దళితుల సమస్యల పరిష్కారానికి రాజకీయాలకతీతంగా దళిత సంఘాలు సమష్టి కృషి చేయాలని మండల ఆదర్శ దళిత హక్కుల పరిరక్షణ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు అన్నారు. భిక్షాలు అధ్యక్షతన సంఘ సమావేశం ముదినేపల్లిలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దళితుల సమస్యలను పరిష్కరించేందుకు దళిత నాయకులు కృషి చేయాలన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించేందుకు అధికారులపై సంఘ నాయకులు వత్తిడి తేవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు లేళ్ల ఆంజనేయులు, నాయకులు కోటే ప్రవీణ్, వెంకటరమణ, రాంబాబు, సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాటు చేసిన తూములతో ఇబ్బంది లేదు



నందివాడ: మండలంలోని అరిపిరాల వద్ద భూమికోడు డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన తూముల వలన రైతులకు ఎటువంటి ఇబ్బంది లేదని పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి, తుమ్మలపల్లి, రామాపురం మాజీ సర్పంచ్‌లు సాదం సాంబశివరావు, అందుగుల ఏసుపాదం తెలిపారు. మండలంలోని అరిపిరాలలో వారు రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భూమికోడు డ్రెయిన్‌పై అక్రమంగా చేపల చెరువులకు మార్గం నిర్మించారంటూ కొంతమంది చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పరిసర ప్రాంతాల్లో దశాబ్ద కాలం క్రితమే భూములన్నీ చేపల చెరువులుగా మారిపోయాయన్నారు.

ఎంపీపీకి సత్కారం



ఎంపీపీని సత్కరిస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమితులైన ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణను ఆ పార్టీ నాయకులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్యదర్శిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాచూరి కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, పెయ్యేరు వైస్ సర్పంచ్ సతీష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం

గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. సోమవారం ఆయన స్థానిక 11వ వార్డులో పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

● పరీక్ష కేంద్రం పరిశీలన

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలను జిల్లా పరీక్షల కమిటీ (డి.ఇ.సి) అధికారులు కే నరసింహారావు, నాగరవి బృందం, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అరుణప్రభ బృందం పరిశీలించారు. మొత్తం 119 మంది విద్యార్థులకు గాను 116 మంది హాజరైనట్లు సీఎస్ సుధాకర్, డీఓ గంగాధర్ తెలిపారు.

● 'స్పందన'లో రెండు అర్జీలు

పామర్రు: ప్రజా స్పందనలో రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వీ రవికాంత్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐ రాము, హౌసింగ్ ఏఈ పవన్, వెలుగు సీసీ స్వప్న మణి, మండల సర్వేయర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● అధికారులు ఇబ్బందిపెడుతున్నారు

పెదపారుపూడి: పంచాయతీ అధికారులే తనను ఇబ్బంది పెడుతున్నారని గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను దళిత మహిళ సర్పంచ్ అయినందును పంచాయతీ కార్యదర్శి సురేంద్రచౌదరి, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి గ్రామాభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరైనా పనులు జరగకుండా ఆటంకం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైన జిల్లా స్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉప సర్పంచ్ గాంధీ పాల్గొన్నారు.

కవితల పోటీల్లో విజేతల ప్రకటన

గుడివాడ టౌన్: సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలను వసుధ బసవేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీమిత్ర సంస్థ సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్‌లో జరిగిన ఈ పోటీల్లో పామర్తి లీలావతి ప్రథమ, హరిత ద్వితీయ, బి. శిరీష తృతీయ బహుమతులు సాధించారని పేర్కొన్నారు.

ఘనంగా గంగానమ్మ ఆలయ శంకుస్థాపన



గుడ్లవల్లేరు: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా వేద పండితులు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలను వేద పండితులు చేపట్టారు. ఈ ఆలయాన్ని గ్రామస్తుల సంయుక్త సహకారంతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవికుమార్, మాజీ లయన్స్ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


షాపుల లైసెన్స్ ఫీజుల వసూలు

మండవల్లి: మండవల్లిలో షాపుల లైసెన్స్ ఫీజులను సర్పంచ్ మెండా ఝాన్సీ దంపతులు మెండా సురేష్ ఆధ్వర్యంలో వసూలు చేసే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి పన్ను, నీటి పన్ను, లైసెన్స్ ఫీజులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కైకలూరు: రాష్ట్రంలో 50వ ధర్మక్షేత్రంగా విలసిల్లుతున్న వరహాపట్నం శ్రీ భూ సమేత శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఈఓ శేఖర్ సోమవారం తెలిపారు. ఈ నెల 11న స్వామివారి దివ్య కల్యాణం, 12న గరుడోత్సవం, 13న చందనోత్సవం, రథోత్సవం, 14న గ్రామోత్సవం, 15న అఖండ అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా పుట్టలాంబ బ్రహ్మోత్సవాలు



గుడివాడ టౌన్: నందివాడ మండలం జనార్దనపురంలోని శ్రీ రేణుకా పుట్టలాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వార్షికోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారికి అభిషేకాలు గావించి పుష్పాలంకరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గీతాపారాయణం, సాంఘిక నాటికలు ప్రదర్శించారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... వారు ఇచ్చిన ... ప్రకారం ... మాగంటి శ్రీనివాసరావు గారి భార్య అనిత, మాగంటి సోమేశ్వరరావు గారి కుమారుడు శ్రీనివాసరావు గార్ల స్థిరాస్తిని రిజిష్టర్ తనఖా చేసుకుని మాగంటి శ్రీనివాసరావు గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నాము. ... ఈ ప్రకటన నేటి నుండి 7 దినముల లోపు ... తెలియజేయగలరు. ...

షెడ్యూల్ : కృష్ణాజిల్లా, పామర్రు సబ్ రిజిష్టారు వారి ... పామర్రు మండలం, జుజ్జువరం గ్రామ రెవిన్యూ ఏరియాలో ... దస్తావేజు నెం. 2754/2016లో ... రీ.సర్వే నెం. 66/3Aలో 291 ... తూర్పు : ... 121 లింకులు, దక్షిణం : ... 50 లింకులు, పడమర: ... 121 లింకులు, ఉత్తరం: ... 50 లింకులు.

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం